క్లుప్తంగా

క్షతగాత్రుడికి ఆర్థిక సాయం



వైద్యానికి సాయం అందిస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులు

రావులపాలెం: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులు ఆదివారం ఆర్థిక సాయం అందజేశారు. రాజమహేంద్రవరం మంగళవారపుపేటకు చెందిన బాసిన కౌషిక్ కోరుకొండలోని అతని సోదరి ఇంటికి వెళుతుండగా మార్గమధ్యలో ఎదురుగా వస్తున్న వాహనం ఢీకొని గాయాలపాలయ్యాడు. ప్రాణాపాయస్థితిలో ఆస్పత్రిలో వైద్యం పొందుతున్నాడు. పేదరికంలో ఉన్న అతని కుటుంబ సభ్యులు వైద్యఖర్చుల కోసం రావులపాలెం కాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులను సాయం కోరారు. దీంతో రూ.15 వేల సాయంగా అతని కుటుంబ సభ్యులకు సేవా సమితి సభ్యులు అందజేశారు.

చెరువును శుభ్రం చేసిన స్థానికులు



చెరువును శుభ్రం చేస్తున్న స్థానికులు

అంబాజీపేట: పుల్లేటికుర్రు శివారు వ్యాఘ్రేశ్వరంలో వేంచేసిన బాలత్రిపురసుందరి సమేత వ్యాఘ్రేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న చెరువును స్థానికులు ఆదివారం స్వచ్ఛందంగా శుభ్రం చేశారు. చెరువులో పేరుకు పోయిన చెత్త, పూడికతీత పనులు చేశారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా శుభ్రం చేస్తున్నట్లు స్థానికులు తెలిపారు.

ఉచిత మెగా వైద్య శిబిరం



మామిడికుదురులో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రమేష్‌బాబు

మామిడికుదురు: స్థానిక అంబేడ్కర్ సామాజిక భవనంలో జనసేన ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ రాపాక రమేష్‌బాబు ఆధ్వర్యంలో రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గౌస్ మొహిద్దీన్, పార్టీ నేతలు రుద్రా శ్రీను, ఈలి రాంబాబు, మట్టా సత్తిబాబు, యింటి మహేంద్ర పాల్గొన్నారు.

సమ్మర్ ఫుట్‌బాల్ కోచింగ్ ముగింపు



క్రీడాకారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న సీఆర్‌సీ స్పోర్ట్స్ డైరెక్టర్ వీర్రాఘవరెడ్డి

రావులపాలెం: స్థానిక డాన్‌బాస్కో క్రీడా మైదానంలో కోనసీమ జిల్లా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించి ఫుట్‌బాల్ సమ్మర్ కోచింగ్ క్యాంపు శనివారం రాత్రితో ముగిసిందని పీఈటీ పల్లా శ్రీను తెలిపారు. విజేతలైన క్రీడాకారులకు సీఆర్‌సీ స్పోర్ట్స్ డైరెక్టర్ నల్లమిల్లి వీర్రాఘవరెడ్డి చేతుల మీదుగా సర్టిఫికేట్లు అందజేశారు. కార్యక్రమంలో ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్ తేజారెడ్డి, ప్రిన్సిపాల్, ఐ.బల్తాజార్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల మేలు కోసమే జగనన్న భూహక్కు

అంబాజీపేట: భూవివాదాలు లేకుండా వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంతో పరిష్కారమవుతాయని సర్పంచ్ వాసంశెట్టి రేవతి అన్నారు. వక్కలంకలో జగనన్న భూరక్ష పథకంలో భాగంగా భూ సరిహద్దుల్లో సర్వే రాళ్లను నాటే కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. సర్పంచ్ రేవతి మాట్లాడుతూ భూములను రీ సర్వే చేసి పారదర్శకంగా రికార్డులను రూపొందించారన్నారు. సరిహద్దుల్లో రాళ్లను పాతుకునే సమయంలో రైతులు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్లు, సచివాలయ ఉద్యోగులు, స్థానికులు పాల్గొన్నారు.

వ్యాపారి మృతికి సంతాపం

అంబాజీపేట: గ్రామంలో పూర్వ వ్యాపారి దొమ్మేటి శ్రీరాములు అకాల మృతికి సంతాపంగా ఆదివారం స్థానికంగా ఉన్న ఫ్యాన్సీ, కూల్ డ్రింక్స్, షోడా బడ్డీలు మూసివేసి సంతాపం వ్యక్తం చేశారు. 60 ఏళ్ల నాటి కాలంలో గోలీ షోడా, కిళ్లీలు, కూల్ డ్రింక్స్ వ్యాపారాన్ని స్థాపించి ఎంతో పేరు గాంచారు. ఇటీవల కూల్‌డ్రింక్స్ వ్యాపారానికి హోల్‌సేల్ డీలర్‌గా వ్యవహరిస్తున్నారు. శ్రీరాములు మృతికి సంతాపంగా తోటి వ్యాపారులు ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించి శ్రద్ధాంజలి ఘటించి సంతాపం వ్యక్తం చేశారు.

నెరవేరనున్న చిరకాల కోరిక

- గోదావరి పాయపై కొత్త వంతెన
- గత ప్రభుత్వ హయాంలో పూర్తి నిర్లక్ష్యం
- రూ.2 కోట్లతో నిర్మాణం
- ఆరు నెలల్లో వంతెన నిర్మాణం



టేకిశెట్టిపాలెం వద్ద గోదావరి పాయపై శిథిల తూరల కాజ్ వే (ఫైల్)



టేకిశెట్టిపాలెం వద్ద గోదావరి పాయపై నిర్మించిన కొత్త కాజ్ వే

సఖినేటిపల్లి: టేకిశెట్టిపాలెం ఏటిగట్టు వద్ద నుంచి అప్పనరామునిలంక గ్రామానికి పోవు మార్గంలోని బాడిరేవు (గోదావరి పాయ)పై నిర్మించిన పూర్వం నాటి కాజ్‌వేకు ఎట్టకేలకు మోక్షం చేకూరింది. ఎత్తు తక్కువలో ఉండి, శిథిలస్థితికి చేరుకున్న ఈ కాజ్‌వే స్థానే కొత్త కాజ్ వే నిర్మాణానికి ఆర్అండ్‌బీలో ప్రస్తుత ప్రభుత్వం మంజూరు చేసిన రూ.2 కోట్లతో నిర్మించనున్న ఈ కాజ్‌వేకు గతేడాది డిసెంబర్ ఒకటిన అమలాపురం ఎంపీ చింతా అనురాధ, రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు శంకుస్థాపన చేశారు. ఈ క్రమంలో ఆరు నెలల కాలంలోనే పనులు పూర్తి చేసిన అధికారులు ఇక అప్రోచ్ రోడ్లు నిర్మించి ప్రారంభోత్సవానికి ఈ కాజ్ వే ను అధికారులు సిద్ధం చేస్తున్నారు. లోతట్టు కాజ్‌వేతో ఇంత వరకూ ప్రజలు పడిన ఇబ్బందులు ఇకపై కొత్త కాజ్‌వేతో తొలగనున్నవి.

ఎన్నడూ లేని విధంగా..

సాధారణంగా ఏటా ఆగస్టు, సెప్టెంబర్ నెలల మధ్య వస్తున్న వరదల సమయంలో ఈ కాజ్ వే మునిగిపోవడం పరిపాటి. అయితే గత ఏడాది ఎన్నడూ లేని విధంగా జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో రోజులు తరబడి కాజ్ వే వరద ముంపు నీటిలో మునిగి ఉండడంతో ఈ మార్గంలో వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ధవళేశ్వరం వద్ద మొదటి వరద ప్రమాద హెచ్చరిక జారీతోనే మునిగిపోతున్న ఈ కాజ్ వే, పై మూడు నెలల్లో రెండు నుంచి మూడు వారాలు చొప్పున వరద నీటిలో రోజుల తరబడి చిక్కుకుంది. ఈ కాజ్ వే మీదుగా ఇతర ప్రాంతాలకు ఉన్న రవాణా సదుపాయాలు ధవళేశ్వరం వద్ద వరద నీటిమట్టం 11.75 అడుగులకు (మొదటి ప్రమాద హెచ్చరిక) చేరగానే కాజ్‌వే పూర్తిగా మునిగి రవాణా మార్గాలు మూసుకుపోవడం పరిపాటి అయింది.

పూర్వకాలం నాటి కాజ్ వే..

టేకిశెట్టిపాలెం, అప్పనరామునిలంక గ్రామాల మధ్య గోదావరి పాయపై చిన్నపాటి తూరలతో కాజ్ వేను అప్పట్లో పాలకులు ఏర్పాటు చేశారు. కాజ్ వేకు అమర్చిన మొదటి వరస తూరలన్నీ నత్తగుల్లలతో మూసుకుపోయి నీటి ప్రవాహం మందగించడంతో తదనంతర కాలంలో రెండో వరస తూరలతో కాజ్ వేను అభివృద్ధి చేశారు. అయితే ఏళ్లు గడుస్తున్నా గత ప్రభుత్వం దీనిపై దృష్టి పెట్టకపోవడంతో రెండు వరసల్లోని తూరలన్నీ పూర్తిగా నత్త గుల్లలతో మూసుకుపోయి నీటి ప్రవాహం కూడా పూర్తిగా మందగిస్తోంది. అలాగే గోదావరి పోటు, పాటు సమయాల్లో కూడా ఉప్పునీరు లోతట్టుగా ఉన్న కాజ్ వేను ముంచెత్తుతూ ఈ దారిలో రవాణ సదుపాయాలకు గండి కొడుతోంది.

మొదటి వరద ప్రమాద హెచ్చరికతోనే..

ధవళేశ్వరం వద్ద మొదటి వరద ప్రమాద హెచ్చరిక జారీతోనే లోతట్టుగా ఉన్న ఈ కాజ్ వే పూర్తిగా మునిగిపోతుంది. దీంతో ఈ మార్గంలో రవాణా సదుపాయాలు పూర్తిగా నిలిచిపోతుండడంతో ఇతర ప్రాంతాల వారు టేకిశెట్టిపాలెం మీదుగా అప్పనరామునిలంకకు వెళ్లడానికి ఆస్కారం లేకుండా పోతోంది. అలాగే అప్పనరామునిలంక వాసులు బయటకు రావడానికి కూడా ఆస్కారం లేకుండా పోతుంది. వీరితో పాటు చించినాడ వంతెన మీదుగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాతో పాటు ఇతర ఉమ్మడి జిల్లాల భక్తులు వరదల సమయాల్లో ఈ కాజ్ వే మీదుగా ప్రయాణించి అంతర్వేది పుణ్యక్షేత్రానికి వెళ్లడానికి అవరోధంగా మారుతోంది.

నిర్మాణం పూర్తి కావడం హర్షణీయం



తక్కువ ఎత్తులో ఉండి శిథిలస్థితికి చేరుకున్న కాజ్ వే స్థానే పక్కా కాజ్ వే నిర్మాణం దాదాపుగా పూర్తికావడం హర్షణీయం. గత ప్రభుత్వంలో ఈ కాజ్ వే పూర్తి నిర్లక్ష్యానికి గురైంది. ప్రస్తుత ప్రభుత్వంలో ప్రజల చిరకాల కోరిక నెరవేరనున్నది. సుమారు మూడు అడుగుల ఎత్తులో కొత్త వంతెన నిర్మించడం వరద బాధితులకు ఊరటనిస్తుంది.

– వీరా మల్లిబాబు, ఎంపీపీ, సఖినేటిపల్లి

రవాణాకు ఇబ్బందులు ఉండవు



ఏటా క్రమం తప్పకుండా వచ్చే వరదలకు ప్రారంభంలోనే కాజ్ వే పై రవాణాకు వచ్చే సమస్యలు ఇకపై రావు. కొత్త కాజ్ వే నిర్మాణం ఎత్తుగా ఉండి, వరదల సమయంలో పెరిగే నీటి మట్టం తీవ్ర స్థాయికి చేరే వరకూ ప్రజల రాకపోకలకు అంతరాయం లేకుండా ఉంటుంది.

– ఇందుకూరి సుబ్బరాజు, సర్పంచ్, అప్పనరామునిలంక

తక్కువ కాలంలోనే కొత్త కాజ్‌వే నిర్మాణం



టేకిశెట్టిపాలెం వద్ద గోదావరి పాయపై కొత్త కాజ్ వే నిర్మాణం తక్కువ కాలవ్యవధిలోనే దాదాపుగా పూర్తి అయింది. ఆర్అండ్‌బీలో రూ.2 కోట్ల అంచనాతో దీనిని పూర్తి చేశారు. కాజ్ వేకు చెందిన ఇతర పనులు అధికారులు పూర్తి చేసి త్వరలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నారు.

– రాపాక వరప్రసాదరావు, ఎమ్మెల్యే, రాజోలు

రైతు పూజ్యనీయుడు



ఇరుసుమండలో రైతులను సన్మానించిన సతీష్

అంబాజీపేట: ప్రతి రోజూ ప్రజలందరికీ పట్టెడు అన్నం పెట్టే రైతు అందరికీ పూజ్యనీయుడని కోనసీమ ఆహార నిధి వ్యవస్థాపక అధ్యక్షుడు వీరంశెట్టి సతీష్ అన్నారు. ఏరువాక పౌర్ణమి సందర్భంగా ఇరుసుమండలో సతీష్ ఆధ్వర్యంలో రైతు పూజోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఏరువాకకు పూజలు నిర్వహించి దుక్కు దున్నారు. అనంతరం రైతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రామకృష్ణ, పరమహంస, రంకిరెడి కాశీ, విజయరావు, ఏడుకొండలు, శర్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు తాడిపూడిలో గడప గడపకూ..

ఆత్రేయపురం: మండలంలోని తాడిపూడిలో సోమవారం ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు మధ్యాహ్నం 4 గంటల నుంచి 8 గంటల వరకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని పార్టీ మండల కన్వీనర్ కనుమూరి శ్రీనివాసరాజు తెలిపారు. కార్యక్రమానికి కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి పాల్గొంటారన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

ధనమ్మ తల్లి తీర్థ మహోత్సవం

తాళ్లరేవు: స్థానిక మాధవరాయునిపేట గ్రామదేవత ధనమ్మ తల్లి అమ్మవారి తీర్థమహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి అమ్మవారి జాతర సందర్భంగా గరగ నృత్యాలు, డప్పుల వాయిద్యాలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఘనంగా సప్తనదీ తీర్థ మహా జ్యేష్ఠాభిషేకం



అంతర్వేదిలో సప్తనది నదీ జలాల కలశలతో ఆలయ ప్రదక్షిణ చేస్తున్న అర్చకులు

సఖినేటిపల్లి: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానంలో ఆదివారం జ్యేష్ఠ పూర్ణిమ, జ్యేష్ఠా నక్షత్ర మహా పర్వదినం సందర్భంగా లక్ష్మీ నృసింహుని మూలవిరాట్‌కు అర్చకులు, వేదపండితులు సప్తనది తీర్థ మహా జ్యేష్ఠాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ ఆధ్వర్యాన ఆలయ ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్, స్థానాచార్య వింజమూరి రామ రంగాచార్యులు పర్యవేక్షణలో అర్చకులు, పండితులు వేదమంత్రాలతో నిర్వహించారు. గంగా, యమున, సరస్వతి, గోదావరి, నర్మదా, సింధు, కావేరి పుణ్యనదుల్లోని పవిత్రమైన జలాలతో స్వామివారి మూలవిరాట్టుకు అభిషేకం నిర్వహించారు. ఆలయ చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమార రామ గోపాల రాజా బహద్దూర్ ఆనవాయితీగా ఆయా విశేష పూజల్లో పాల్గొన్నారు. తొలుత వేకువ జామున ప్రధాన అర్చకుడు శ్రీనివాస కిరణ్ విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. అనంతరం ఆయన నేతృత్వంలో అర్చకులు దీక్షా ధారణ చేపట్టి, సప్తనదీ కలశ ఆవాహనాలు, ఆరాధనాలు, విశేష అర్చనలు, అగ్నిమథనం చేసి, కలశలతో ఆలయ ప్రదక్షిణం చేశారు. తదనంతరం సప్తనది జలాలతో, చతుర్దశ, నవ, పంచామృత కలశాలతో స్వామివారి మూలవిరాట్టుకు సప్తనదీ తీర్థ మహా జ్యేష్ఠాభిషేకం నిర్వహించి, స్వామికి విశేష అర్చన చేశారు. శ్రీవారికి ప్రీతికరమైన అప్పాలు, పాయసం, మారేడుదళాలు, ఆవు నెయ్యి తదితర వాటితోను, అమ్మవారికి ప్రీతికరమైన తామర, మొదుగ పుష్పాలతోను, తెల్ల ఆవాలు, ధాన్యం, తేనెతోను మహాశాంతి హోమం వైఖానస ఆగమశాస్త్ర ప్రకారం ప్రధాన అర్చకుడు కిరణ్ నిర్వహించారు. పూర్ణాహుతి, స్వామికి నీరాజన మంత్ర పుష్పాలు, మంగళాశాసనం, తీర్థగోష్ఠి, భక్తులకు ఆశీర్వచనాలు, పండిత సత్కారం, ప్రసాద వినియోగం నిర్వహించారు. పలువురు ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

పేద విద్యార్థుల కోసమే ‘ఆత్మ’



సమావేశంలో మాట్లాడుతున్న వేగేశ్న వెంకట కృష్ణంరాజు

ఆత్రేయపురం: పేదరికంతో చదువులు అగకూడదనే ఉద్దేశంతో ఆత్మ సంస్థను ఏర్పాటు చేశామని, దీని ద్వారా పేద విద్యార్థులకు అండగా నిలబడగలమని ఎన్ఆర్ఐ డాక్టర్ వేగేశ్న చారిటబుల్ ట్రస్టు అధినేత డాక్టర్ వేగేశ్న వెంకట రామకృష్ణంరాజు, నెహ్రూ అవార్డు గ్రహీత వేగేశ్న తమ్మిరాజు అన్నారు. ఆదివారం సాయంత్రం ఆత్రేయపురంలో ఎన్ఆర్ఐ వేగేశ్న రామకృష్ణంరాజు స్వగృహం వద్ద ఆత్రేయపురం మహాత్మాగాంధీ పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, పలువురు ప్రముఖులతో సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో ఆత్మ సంస్థకు నూతన కమిటీ ఏర్పాటు గురించి చర్చించి పలువురిని గుర్తించారు. వేగేశ్న వెంకట రామకృష్ణంరాజు, తమ్మిరాజు మాట్లాడుతూ ప్రభుత్వం పేదల విద్య కోసం చర్యలు తీసుకుంటున్న ఇంకా పలు చోట్ల పేదలు తమ పిల్లలను చదవించుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారని దానిని గమనించి ఆత్రేయపురం మహాత్మాగాంధీ కళాశాల పూర్వ విద్యార్థులతో కలసి ఆత్మ సంస్థను ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అర్హతలు కలిగిన పేద విద్యార్థులకు విద్యను అభ్యసించేందుకు ఆత్మ సంస్థ తోడుగా ఉంటుందన్నారు. సమావేశంలో మంతెన ఆనందరాజు, గాదిరాజు ప్రసాదరాజు, శిష్టా సూర్యకుటుంబరావు, సీహెచ్‌వీ సుబ్బరాజు, చిలువూరి చిన్న వెంకట్రాజుతో పాటు బలుసు రమణమూర్తి, అయ్యగారి వెంకట రామయ్యలు సంస్థ ఏర్పాటుకు నియమ నిబంధనల గురించి వివరించారు. అందరూ కలసికట్టుగా ఉండి సంస్థను ముందుకు తీసుకువెళ్లాలని పలువురు సభ దృష్టికి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ ముదునూరి రామరాజు, మండల టీడీపీ అధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



బి.సావరం దుర్గామల్లేశ్వరస్వామి వార్లను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి తదితరులు

కొత్తపేట: స్థానిక బొరుసువారిసావరంలో వేంచేసిన విజయ కనకదుర్గాదేవి అమ్మవారి నూతన ఆలయం పదో వార్షికోత్సవ కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఈ నెల 2 నుంచి మూడు రోజుల పాటు నూతన ఆలయ నిర్మాణ కర్త, ఆలయ పోషకుడు బొరుసు వెంకటఉదయభాస్కర్-వసుధ దంపతుల ఆధ్వర్యంలో ఆలయ కమిటీ ప్రెసిడెంట్ పసుపులేటి శ్రీనివాస్-సత్యవేణి దంపతుల పర్యవేక్షణలో ఆలయ అర్చకులు బిక్కవోలు సత్యనారాయణాచార్యులు, వేదపండితులు బ్రహ్మశ్రీ బిక్కవోలు అనంతలక్ష్మణకుమారాచార్యులు బ్రహ్మత్వమున, వేదపండితుల బృందం వివిధ పూజ, హోమం తదితర కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ప్రధానంగా మూడోరోజు ఆదివారం అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం, లక్ష్మీగణపతి, అగ్నిసంప్రోక్షణ, ఉక్తహోమం, దుర్గాసూక్త హోమం, మూలా నక్షత్ర హోమం, వర్షవర్ధన హోమం, మహా పూర్ణాహుతి, మహాచండీ యాగం, విష్వక్సేన ఆరాధన, చతుర్దశ కలశాభిషేకం, స్త్రీల సౌభాగ్యం కోసం అత్యధిక సంఖ్యలో మహిళలతో సామూహిక కుంకుమార్చన, అనంతరం దుర్గామల్లేశ్వరస్వామివార్ల దివ్యతిరు కళ్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు భాస్కర్ ఆధ్వర్యంలో వేదపండితులు వేదమంత్రోచ్చారణ నడుమ పూర్ణకుంభ స్వాగతం పలికి ఆలయానికి తోడ్కొనివెళ్లి వేదాశీర్వచనాలు అందజేశారు. అనంతరం ప్రసాద వితరణ, అన్నసమారాధన జరిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మార్గన గంగాధరరావు, పార్టీ నాయకుడు కర్రి నాగిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, బి సావరం గ్రామ యువకులు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కొత్తపేట పరిసర గ్రామాల నుంచి భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మున్సిపల్ ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఎమ్మెల్సీ కుడుపూడి

అమలాపురం టౌన్: అమలాపురం మున్సిపల్ కౌన్సిల్ ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఇటీవల ఎమ్మెల్సీగా ఎన్నికైన పట్టణానికి చెందిన కుడుపూడి సూర్యనారాయణరావు వ్యవహరించనున్నారు. మున్సిపల్ కౌన్సిల్‌లో ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఉండేందుకు ఎమ్మెల్సీ కుడుపూడి తన అంగీకారాన్ని తెలుపుతూ మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడికి శనివారం దరఖాస్తు పంపారు. ఎక్స్ అఫీషియో సభ్యుడిగా కుడుపూడి నియామకం లాంఛనంగా పూర్తయినట్లే. ఇప్పటికే ఈ మున్సిపాలిటీకి ఎక్స్ అఫీషియో సభ్యులుగా స్థానిక ఎమ్మెల్యే మంత్రి పినిపే విశ్వరూప్, అమలాపురం ఎంపీ చింతా అనురాధ వ్యవహరిస్తున్నారు. ఇప్పుడు ఎమ్మెల్సీ కుడుపూడి చేరికతో మున్సిపాలిటీ పాలక పక్షానికి ఎక్స్ అఫీషియో సభ్యుల సంఖ్య ముగ్గురికి పెరగనుంది. ఇకపై ఎమ్మెల్సీ కుడుపూడి మున్సిపల్ సమావేశాలకు హాజరయ్యే అధికారం, అవకాశం వచ్చినట్టైంది.

ఘనంగా ‘ననుబోలు’ జయంతి



వాడపాలెంలో రక్తదానం చేసిన యువకులు

కొత్తపేట: దివంగత పార్టీ రాష్ట్ర నాయకుడు ననుబోలు సత్యనారాయణ జయంతిని పురస్కరించుకుని ఆయన కుటుంబ సభ్యులు, అభిమానులు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అయ్యప్పస్వామి భక్తుడిగా వాడపాలెంలోని అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణంలో సత్యనారాయణ కీలకపాత్ర పోషించారు. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్న ఆయన తన నివాస ప్రాంతంలో ఆంజనేయస్వామి ఆలయాన్ని కూడా నిర్మించారు. ననుబోలు సత్యనారాయణ వైఎస్సార్ సీపీకి చేసిన సేవలను గుర్తించి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి సిఫారసు మేరకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 2020 అక్టోబర్‌లో రాష్ట్ర కృష్ణ బలిజ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించారు. ననుబోలు గత ఏడాది జూన్ 30న రాజమహేంద్రవరం వెళ్లి తిరిగి వస్తుండగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా ఆదివారం ఆయన జయంతిని పురస్కరించుకుని వాడపాలెంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 20 మంది యువకులు ముందుకు రాగా వారి నుంచి అమలాపురం ఏరియా ఆస్పత్రి బ్లడ్ బ్యాంక్ సిబ్బంది సంబంధిత వ్యానుతో వచ్చి బ్లడ్ సేకరించారు. రావులపాలెం శుభోదయ అంధుల హాస్టల్‌లో 30 మంది అంధులకు అన్నదానం చేశారు. ముందుగా సత్యనారాయణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో ననుబోలు మణికంఠ, తుపాకుల సాయికృష్ణ, బక్క మురళి, గంట శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



నగరంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: రెండు నెలల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో కుడి కాలు దెబ్బతిని స్టిక్ సహాయంతో నడుస్తూ ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్న పి.గన్నవరం మండలం నరేంద్రపురానికి చెందిన మామిడిశెట్టి సాయియశ్వంత్ పరిస్థితిని చూసి చలించిన రాష్ట్ర సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మానవత్వం చూపారు. యశ్వంత్ పరిస్థితిని పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు సీఎం దృష్టికి తీసుకువెళ్లగానే ఆయన స్పందించి సీఎం సహాయ నిధి నుంచి రూ.5 లక్షలు ఆర్థికసాయం అందించారు. నగరంలో ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు స్వగృహం వద్ద ఆదివారం జరిగిన సమావేశంలో ఈ చెక్కును ఎమ్మెల్యే చిట్టిబాబు లబ్ధిదారుని కుటుంబానికి అందజేశారు. దీంతో సహా సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన ఆరుగురికి రూ.6.85 లక్షల విలువైన చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అప్పనపల్లికి చెందిన కామిశెట్టి రాజాకు రూ.35 వేలు, కడలి వెంకటేశ్వరరావుకు రూ.18 వేలు, పెదపట్నానికి చెందిన చెల్లుబోయిన కృష్ణకు రూ.18 వేలు, కోన సూర్యనారాయణకు రూ.60 వేలు చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బొంతు నీలిమ, పార్టీ నేతలు పిచ్చుక చిన్న, గెడ్డం వెంకటేశ్వరరావు, కొండేటి వెంకటేశ్వరరావు, చిట్టాల సత్తిబాబు, కొమ్ముల చిన్న, యేడిద లక్ష్మణరావు పాల్గొన్నారు.

బాలికపై లైంగిక దాడి: యువకుడిపై కేసు

పి.గన్నవరం: ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి బాలికపై గత ఐదేళ్లుగా లైంగిక దాడికి పాల్పడుతున్న యువకుడిపై పి.గన్నవరం పోలీసులు ఆదివారం రాత్రి కేసు నమోదు చేశారు. ఏఎస్సై అప్పారావు తెలిపిన వివరాల ప్రకారం.. ముంగండపాలెం శివారు ముంజవరపుకొట్టు గ్రామానికి చెందిన ఒక బాలికను పెళ్లి చేసుకుంటానని నమ్మించి రాజోలు మండలం ములికిపల్లి గ్రామానికి చెందిన ముసునూరి వరప్రసాద్ ఐదేళ్లుగా లైంగిక దాడికి పాల్పడుతున్నాడు. తనను పెళ్లి చేసుకోమని ఆమె ఒత్తిడి చేయడంతో, అతడు నిరాకరించాడు. దీంతో గత నెల 18న పెద్దల్లో తగవు పెట్టారు. అయినప్పటికీ అతడు పెళ్లికి అంగీకరించలేదు. దీంతో ఆగ్రహించిన యువకుడు నీ అంతు చూస్తానని బాలికను బెదిరించాడు. ఈ మేరకు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఏఎస్సై అప్పారావు కేసు నమోదు చేయగా, కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ దర్యాప్తు చేస్తున్నారు.

మళ్లీ మళ్లీ ఇది రాని రోజు



అంబాజీపేట కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఒకే వేదికపై పూర్వ విద్యార్థులు

అంబాజీపేట: స్నేహ బంధం ఎంతో మధురమైనది. జీవితాంతం తరిగిపోదు.. చెరిగిపోదు.. మొదటి స్నేహం ఏర్పడేది పాఠశాల స్థాయిలోనే.. చిన్ననాటి స్నేహానుబంధాన్ని మరోసారి ఆత్మీయ కలయిక ద్వారా పూర్వ విద్యార్థులు గుర్తు చేసుకున్నారు. అంబాజీపేట కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో ఉన్న కల్యాణ మండపంలో 1987–88 పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఘనంగా నిర్వహించిన పూర్వ విద్యార్థుల అపూర్వ కలయికతో కలుసుకున్నారు. 35 ఏళ్ల ఆనాటి అనుభూతులను ఒకరికొకరు గుర్తు చేసుకుని నెమరువేసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంతో పలకరించుకొంటూ క్షేమ సమాచారాలు తెలుసుకున్నారు. నాటి చిలిపి అల్లరి పనులు గుర్తు చేసుకొంటూ విద్యార్థుల్లా మారిపోయారు. ప్రస్తుత వారి పరిస్థితి, చేసే ఉద్యోగం, కుటుంబ పరిచయాలతో అక్కడి వాతావరణం సందడిగా మారింది. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన గురువులను దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. తొలుత వారు చదువుకున్న పాఠశాలను సందర్శించి అలనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. కట్టా వెంకటేశ్వర్లు, కొడుకుళ్ల శంభూప్రసాద్, వాసంశెట్టి రమణ, పితాని రామకృష్ణ, దొమ్మేటి సాంబశివరావు, దేవులపల్లి అన్నపూర్ణ విశాలాక్షి, దొమ్మేటి పుష్పలత, పెదమల్లు శశికళల ఆధ్వర్యంలో విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు.

చాలా ఆనందంగా ఉంది



35 ఏళ్ల తర్వాత స్నేహితులందరినీ కలుసుకోవడం చాలా ఆనందంగా ఉంది. ఒక్కసారిగా పాత రోజులు గుర్తుకు రావడంతో ఎంతో ఉద్వేగానికి లోనయ్యాను. అలనాడు చదువు చెప్పిన గురువులను సన్మాంచుకోవడం, తోటి స్నేహితులతో ఉత్సాహంగా గడపడం మరోసారి విద్యార్థి జీవితం గుర్తుకువచ్చింది.

– దేవులపల్లి అన్నపూర్ణ విశాలక్షి, రాజమహేంద్రవరం

పాత రోజులు గుర్తొచ్చాయి



పూర్వం చదువుకున్న స్నేహితులందరినీ ఒకే వేదికపై చూడటంతో పాత రోజులు గుర్తుకువచ్చి కళ్లు చెమర్చాయి. ఎంతో వ్యయప్రయాసల కోర్చి తమ తోటి విద్యార్థులను చూడాలని అలనాటి అల్లర్లను నెమరు వేసుకోవాలనే ఉద్దేశంతో ఖతార్ నుంచి ఇక్కడకు వచ్చాను. ప్రస్తుతం తాను థామస్ కస్టమ్స్ క్లియరెన్స్‌లో కార్యాలయంలో అకౌంటెంట్‌గా పని చేస్తున్నాను.

– దొమ్మేటి వేణుగోపాల్, ఖతార్